ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతిని ప్రశ్నిస్తే అక్రమ కేసులు

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతిని ప్రశ్నిస్తే అక్రమ కేసులతో వేధిస్తున్నారని, ప్రతిపక్ష పార్టీలు సభలు, సమావేశాలు నిర్వహించకుండా జీవో నెం. 1 తెచ్చి నియంతృత్వంగా వ్యవహరిస్తున్నారని, రాజ్యాంగం ప్రకారం దేశంలో ప్రతి పౌరునికి భావ ప్రకటనా స్వేచ్ఛ ఉంది కానీ వైసీపీ పాలనలో మాత్రం రాష్ట్రంలో ప్రజలు కనీసం నోరు తెరచి తమ అభిప్రాయాన్ని చెప్పలేని దుస్థితి నెలకొందని మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్ అన్నారు. ఆయన శనివారం మండల టీడీపీ నాయకులతో కలిసి స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం టీడీపీ నాయకులు మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు సభలు, సమావేశాలు నిర్వహించకుండా పోలీసుల చేత అడ్డంకులు సృష్టిస్తున్నారని,శాంతి భద్రతలు కాపాడాల్సిన పోలీసుల చేత శాంతి భద్రతలకు విఘాతం కల్గించేలా చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో రాజ్యాంగ మౌలిక స్వరూపానికి వ్యతి రేకంగా పాలన, ప్రమాదంలో ప్రజా స్వామ్యం, ప్రజల హక్కుల కాలరాత, ప్రతిపక్షాల అణిచివేత గురించి దేశంలో ఎక్కడా లేని విధంగా మూడున్న రేళ్ల నుంచి ఆంధ్ర ప్రదేశ్‌లో అడుగడుగున రాజ్యాంగ ఉల్లంఘన, చట్టాల ధిక్కరణ జరుగుతోందన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రజలకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కుల్ని కాలరాస్తూ సామాన్య ప్రజల నుంచి ప్రతిపక్ష పార్టీ నేతల వరకు అందరిని వేధింపులకు గురి చేస్తోందన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు తూ.గో జిల్లా అనపర్తిలో సభ నిర్వహించకుండా పోలీసులే అడ్డుకున్నారని, ఉదయం సభకు అనుమతి ఇచ్చి సాయంత్రం అనుమతి లేదంటూ సభను అడ్డుకున్నారన్నారు. పోలీసులే టీడీపీ కార్యకర్తల్ని రెచ్చగొట్టి వారిపై లాఠీ చార్జీ చేసి శాంతి భద్రతలకు విఘాతం కల్పించారని, జెడ్ ప్లస్ రక్షణ ఉన్న చంద్రబాబు నాయుడు వస్తుంటే ట్రాఫిక్ క్లియర్ చేయాల్సిన పోలీసులే ఆయన కాన్వాయికి అడ్డంగా రోడ్డుపై ధర్నాకు కూర్చున్నారని తెలిపారు. ఇలాంటి ఘటనలు దేశంలో ఎక్కడా జరిగిన దాఖలాలు లేవు. స్వతంత్రంగా పనిచేయాల్సిన పోలీసులు, అధికార యంత్రాంగం ప్రభుత్వ పెద్దల ఒత్తిళ్లకు తలొగ్గి చట్టాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తు న్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తర్ర రామక్రిష్ణ, కోరాడ గోవింద, తంగుడు సునీల్, లాడి శ్రీను, దేవాది సింహాద్రమ్మ, పట్ట సింహాచలం, శిమ్మ నారాయణరావు పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ

విశాలాంధ్ర - మందస : మండలం హరిపురం పశువైద్య కేంద్రంలో శనివారం పాడి రైతులకు సంపూర్ణ మిశ్రమ దాణా (టిఎంఆర్)ను పశు వైద్యాధికారులు దువ్వాడ శ్రీకాంత్, కిల్లి ఉమాభారతిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిలో 15.80 రూపాయలు విలువ చేసే దాణాను రాయితీపై కేవలం 6.50 రూపాయలకే సరఫరా చేయడం జరుగుతుందని, దాణా కావాల్సిన పాడి రైతులు సమీప రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హరిపురం ఎంపి టిసి అప్పన్న, బి.రాము, సిబ్బంది బి.లక్ష్మీ, ఎన్.ధర్మేంద్ర, సి.హెచ్.ప్రసన్న, పశుసంవర్ధక శాఖా సహాయకులు బాలక్రిష్ణ, సంతోషి, కళ్యాణ్, హరిక్రిష్ణ, లక్ష్మీ, పార్వతీ, నేతాజీలతో పాటు పాడి రైతులు పాల్గొన్నారు.

హస్తకళల ప్రదర్శన ప్రారంభం

విశాలాంధ్ర - సోంపేట : సోంపేట పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో ఆలిండియా క్రాఫ్ బజార్ పేరుతో నిర్వహిస్తున్న హస్తకళల ప్రదర్శనను సర్పంచ్ ప్రభావతమ్మ శనివారం ప్రారంభించారు. చేనేత, హస్తకళ కళాకారులను ప్రోత్సహించేందుకు ఇటువంటి ప్రదర్శనను నిర్వహించి వస్తువులను విక్రయించడం ఎంతో అవసరమని సర్పంచ్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికి అవసరమైన కళాంకారి పెయింట్స్, హైదరాబాద్ మంచి ముత్యాలు, మార్బుల్ బొమ్మలు, బ్లాక్‌మెటల్, అగరవత్తులు, ఏట కొప్పాక బొమ్మలు, బీట్స్ జ్యూవెలరీ, కార్పెట్స్, రాజస్థాన్ బెడ్‌షీట్స్, బెంగాల్ కాటన్ శారీస్ మొదలైన విలువైన వస్తువులు అందుబాటులో ఉంచడం గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ సలీం తదితరులు పాల్గొన్నారు.

నూతన వేతన సవరణ సంఘాన్ని నియమించాలి

విశాలాంధ్ర - గార : సి.పి.యస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రనరుద్ధరించాలని, 12 వ వేతన సవరణ సంఘన్ని నియమించాలని పెండింగ్ డి.ఎ లను విడుదల చేయాలని, పి.ఎఫ్, ఎ.పి.జి.ఎల్.ఐ లోన్లు విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు గార మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకు మహంతి నవీన్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పాత పెన్షన్ విధానాన్ని అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోగా పునరుద్ధరిస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని, ఉపాధ్యాయులకు ప్రతినెల 1వ తేదీకి జీతం ఇవ్వాలని, ఇప్పటివరకు పెండింగ్లో ఉన్న డీఏలను విడుదల చేయాలన్నారు. పిఎఫ్, ఏపీ జి ఎల్ ఐ, ఫైనల్ పేమెంట్లు మరియు లోనులు తక్షణమే విడుదల చేయాలన్నారు. 12 వేతన సంఘాన్ని నియమించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సనపల సుధాసాగర్ కు మెమోరాండం అందజేశారు. ఈ నిరసన కార్య క్రమంలో గార మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిట్టి త్రినాధరావు, వాసుపల్లి రామారావు మరియు ఉపాధ్యాయులు కందివలస రామారావు కంచరాన గోపాలరావు, వేణుగోపాలరావు, బాబూరావు, సందుల శంకరరావు, గురుమోహన్ ప్రసాద్, గోవిందరావు, క్రిష్టారావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామాజిక పింఛన్లపై తనిఖీ

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా సామాజిక పింఛన్లపై శనివారం నరసాపురం పంచాయతీలో తనిఖీలు నిర్వహించారు. ఉపాధి హామీ పథకం ఆడిట్లో భాగంగా డి ఆర్ పి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి పింఛన్లు పొందుతున్న వారిని కలిసి అర్హతలను పరిశీలించారు. నరసాపురం పంచాయతీలో ట్రైనీ డిఆర్పి కొమర రఘు పింఛను పత్రాలను, మంజూరి పత్రాలను తనిఖీలు నిర్వహించారు. ఆయనతో పాటు లబ్ధిదారులు ఉన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర - సరుబుజ్జిలి : టీడీపీ పార్టీ చంద్రబాబు పై చేసిన రాజ్యాంగ విద్రోహ చర్యలకు వ్యతిరేకంగా సరుబుజ్జిలి మండలంలో టీడీపీ కార్యకర్తలు, అంబేద్కర్ కూడలిలో నిరసన వ్యక్తం చేసి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కి వినతిపత్రం అందచేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మూడున్నరేళ్ల నుంచి ఆంధ్రప్రదేశ్‌లో అడు గడుగున రాజ్యాంగ ఉల్లంఘన, చట్టాల ధిక్కరణ జరుగుతుందని, వైసీపీ ప్రభుత్వం ప్రజలకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కుల్ని కాలరాస్తూ సామాన్య ప్రజల నుంచి ప్రతిపక్ష పార్టీ నేతల వరకు అందరిని వేధింపులకు గురి చేస్తోందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతిని ప్రశ్నిస్తే అక్రమ కేసులతో వేధిస్తున్నారని, ప్రతిపక్ష పార్టీలు సభలు, సమావేశాలు నిర్వహించకుండా జీవో నెం. 1 తెచ్చి నియంతృత్వంగా వ్యవహరిస్తున్నారన్నారు. రాజ్యాంగం ప్రకారం దేశంలో ప్రతి పౌరునికి భావ ప్రకటనా స్వేచ్ఛ ఉందని, కానీ వైసీపీ పాలనలో మాత్రం రాష్ట్రంలో ప్రజలు కనీసం నోరు తెరచి తమ అభిప్రాయాన్ని చెప్పలేని దుస్థితి నెలకొందని చెప్పారు. ప్రతిపక్ష పార్టీలు సభలు, సమావేశాలు నిర్వహించకుండా పోలీసుల చేత అడ్డంకులు సృష్టిస్తున్నారని, శాంతి భద్రతలు కాపాడాల్సిన పోలీసుల చేత శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా చేస్తున్నారని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి శివ్వాలా సూర్యనారాయణ తెలిపారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు తూ.గో జిల్లా అనపర్తిలో సభ నిర్వహించకుండా పోలీసులే అడ్డుకున్నారని, ఉదయం సభకు అనుమతి ఇచ్చి సాయంత్రం అనుమతి లేదంటూ సభను అడ్డుకున్నారన్నారు. పోలీసులే టీడీపీ కార్యకర్తల్ని రెచ్చగొట్టి వారిపై లాఠీ చార్జీ చేసి శాంతి భద్రతలకు విఘాతం కల్పించారన్నారు. జెడ్ ప్లస్ రక్షణ ఉన్న చంద్రబాబు నాయుడు వస్తుంటే ట్రాఫిక్ క్లియర్ చేయాల్సిన పోలీసులే ఆయన కాన్వాయికి అడ్డంగా రోడ్డుపై ధర్నాకు కూర్చున్నారని, ఇలాంటి ఘటనలు దేశంలో ఎక్కడా జరిగిన దాఖలాలు లేవని సాధికార తూర్పు కాపు సంఘం జిల్లా అధ్యక్షులు పల్లి సురేష్ అన్నారు. రాజ్యాంగ నిర్మాత డా. బిఆర్ అంబేద్కర్ సాక్షిగా ప్రజాస్వామ్యానికి పాతర వేస్తున్న ఈ ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ ప్రజాస్వామ్య వాదులు, రాష్ట్ర ప్రజలు ఈ అరాచాకాలకు ముగింపునివ్వాలని సరుబుజ్జిలి మండల అధ్యక్షులు అంబాల రాంబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో కోడిపాతుని దొరబాబు, కింజరాపు సురేష్, గుర్రాల చిన్నబాబు, వాడవలస వెంకటేష్, యండ రామారావు, కె. అమ్మినాయుడు, బాణా గురువులు మరియు ఇతర నాయుకులు పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణుల నిరసన

విశాలాంధ్ర - టెక్కలి : అన్నపర్తి నియోజక వర్గంలో నారా చంద్రబాబు నాయుడు పర్యటనను రోడ్ షోను పోలీసులు శుక్రవారంఅడ్డుకున్నందుకు టెక్కలి టీడీపీ నాయకులు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ జంక్షన్ లోని అంబేద్కర్ విగ్రహనికి వినతపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం డాక్టర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని విస్మరిస్తున్నారని ప్రతి పౌరుడికి ప్రశ్నించే హక్కు ఉందని, ప్రశ్నించే వాళ్ళని పోలీసులతో అణచివేసే ప్రయత్నం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో హనుమంతు రామకృష్ణ, మట్టా పురుషోత్తం, మామిడి రాము, మల్లా బాలకృష్ణ, బెహరా కాళీ, కోళ్ల కామేష్,ధవల రామచంద్ర రావు, మెట్ట చంద్ర రావు,మల్లిపెద్ది మధు, మక్కా శంకర్ రెడ్డి, మెండ దమయంతి, దాసరి శ్రీను, పంగ మన్మదరావు, ముడిదాన ఆనంద్, సంపతిరావు భాస్కర్ రావు,గండి చంద్ర రావు, బసవల తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సేవా రంగాలకు సన్మానం

విశాలాంధ్ర - జలుమూరు : మండలంలోని చల్లవానిపేట జంక్షన్లో ఉన్న ఎంఎస్ఎన్ స్కూల్ 11వ వార్షికోత్సవం సందర్భంగా డైరెక్టర్ మామిడి సూర్యనారాయణ శుక్రవారం పత్రిక, కళా, సేవారంగాలకు సన్మానం చేశారు. విద్యార్థులు సమాజం పట్ల అవగాహన, విద్యపట్ల దృక్పదం కలిగినప్పుడు మంచి విద్యార్థిగా రాణించగలడని సంస్థ డైరెక్టర్ సూర్యనారాయణ అన్నారు. చదువుతో పాటు సంస్కరణలు రెండు ఉంటే ఆ విద్యార్థికి మంచి మనుగడ ఏర్పడుతుందని ప్రగతి పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ గణపతిరావు తెలిపారు. సంస్థ డైరెక్టర్ పత్రికా రంగంలో 35 సంవత్సరాలు అలుపెరగని మంచి గుర్తింపు తెచ్చుకున్న రిపోర్టరు సారవకోట విశ్వేశ్వరరావు, కళారంగంలో నిష్ణాతుడైన వైసీపీ నాయకుడు, చల్లవానిపేట వార్డు మెంబరు, 6 వెబ్రిస్లో నటించి ఎక్కువ మంది మన్ననలను పొందిన వ్యక్తి దుంగ రమణ సేవా రంగంలో చల్లవానిపేట జంక్షన్ హెూటల్ యజమాని పొట్నూరు జనార్ధనరావు కృషికి ఎంఎస్ఎన్ స్కూల్ ఆవరణలో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు వార్షికోత్సవమునకు వీడ్కోలు సభలో పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న వ్యాన్

తల్లి కుమారునికి గాయాలు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : మండలంలోని తమ్మి నాయుడుపేట పంచాయతీ సనపలవానిపేట సమీపంలో జాతీయ రహదారిపై శనివారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. పలాస మండలం రాజగోపాల పురానికి చెందిన అన్నెపు రాకేష్, తల్లి బృందావతి లు విశాఖపట్నం నుంచి ఒక వ్యాన్‌లో ఇంటికి అవసరమయ్యే కలపను తీసుకు వెళ్తుండగా వ్యాన్ డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో డివైడర్ను దాటి మరో వ్యాన్‌ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో వ్యాన్ క్యాబిన్లో కూర్చున్న రాకేష్, బృందావతి గాయపడగ వీరిని శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి 108 అంబులెన్స్ పై తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీ ముఖలింగేశ్వరుని దర్శించుకున్న కలెక్టర్ దంపతులు

విశాలాంధ్ర - జలుమూరు : దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగేశ్వర స్వామిని మహా శివరాత్రి సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీకేష్ దంపతులు దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు నాయుడు గారి రాజశేఖర్, అర్చకులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. వారి పేరున ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీముఖ లింగేశ్వరుని దర్శించుకోవడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. వీరితోపాటు ఆర్డీవో బి. శాంతి, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.
- జిల్లా ఎస్పీ జీఆర్ రాధిక కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఎండల మల్లికార్జున స్వామిని దర్శించుకున్న కృపారాణి దంపతులు

విశాలాంధ్ర - టెక్కలి : శ్రీశ్రీ ఎండ్ల మల్లికార్జున స్వామిని మహాశివరాత్రి సందర్భంగా మాజీ కేంద్రమంత్రి కిల్లి కృపారాణి రామ్మోహన్ రావు దంపతులు దర్శించుకున్నారు. ఆలయ పూజారిచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టతను తెలియజేశారు.

పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : శ్రీశయన కులానికి చెందిన విద్యార్థులు చదువులో రాణించాలని, అందుకు తగిన ప్రోత్సాహాన్ని అందివ్వడం జరుగుతుందని అధ్యక్షులు దేవాడ మోహన రావు అన్నారు. నియోజకవర్గంలో 180 మంది పదవ తరగతి విద్యార్థులకు గాను ఇంగ్లీష్, తెలుగు మాధ్యమంలోని పాఠ్య పుస్తకాలను శనివారం లాలాపేట సామాజిక భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇచ్ఛాపురం విద్యార్థులకు అందజేసారు. అంకితభావంతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి ఉపకార వేతనాలను శ్రీశయన చైతన్య దీపిక, కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌లు సంయుక్తంగా అందివ్వడం జరుగుతుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సురంగి రాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు అధ్యాపకులు సిందిరి మోహనరావు, పి. గిరి, డి. వీర్రాజు, డి. లోకనాథం, పైల రమేష్, బొమ్మిడి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

చక్ర తీర్థ స్నానాలకు ఏర్పాట్లు

విశాలాంధ్ర - జలుమూరు : ఎల్.ఎన్.పేట మండలం మిరియప్పల్లి గ్రామం వద్ద వంశధార నదిలో సోమవారం జరగనున్న చక్రతీర్థ స్నానాలకు ఏర్పాటు చేస్తున్నట్లు తహసిల్దార్ బిఎస్ఎస్ సత్యనారాయణ తెలిపారు.

నవధాన్యాలు సాగు .. నేల తల్లి బాగు అంటున్న రైతులు

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : మండలం మునసబు పేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతుల తో నవధాన్యాలు సాగు పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. భూమిలో 30 రకాల విత్తనాలను (అపరాలు,పచ్చిరొట్ట,కూరగాయలు, సుగంధద్రవ్యాలు,నూనె గింజలు జాతులు) వేయడం వలన నేలలో జీవన ద్రవ్యం పెరిగి భూమి సారవంతంగా మారుతుందని రైతులకు తెలియజేశారు. అలాగే పంటలో జీవ వైవిధ్యం పెరుగుతుందని, ఈ విధంగా ముఖ్య పంట వేసుకోవడానికి ముందు నేలలో పలు రకాల విత్తనాలు వేసుకోవాలన్నారు. తరువాత 40- 45 రోజుల కాలపరిమితి లో వచ్చిన ఆకుకూరలు, కాయకురల్లో ఆదాయం వస్తుందన్నారు. ఇంకా పంటల పై భాగాన్ని పశువుల మేతకు ఉపయోగించుకోవచ్చని, మిగిలిన పంటల వేరు భాగాలని నేలలో కలిపి దున్నుకోవాలని, ఈ విధానంలో రైతులు చేస్తే రైతులకి పూర్తిగా పంటలకు అయ్యే ఖర్చు ఏమి ఉండదన్నారు. అందువలన అందరూ కూడా నవధాన్య సాగు పద్ధతులను పాటించాలని కోరుతూ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ప్రొజెక్ట్ మేనేజర్ ధనుంజయ్, సిబ్బంది అయన కల్పన, దిల్లేశ్వరావు, రైతులు పాల్గొన్నారు.

పరమ పవిత్రం... మహాశివరాత్రి పర్వదినం



విశాలాంధ్ర - కోటబొమ్మాళి : మన ముఖ్యమైన పండుగల్లో మహా శివరాత్రి ఒకటి, ఏటా మఘబహుళ చతుర్దశిని శివరాత్రిగా జరుపుకుంటాం. మహాశివరాత్రి సందర్భంగా శనివారం కోటబొమ్మాళి మండలంలో శివాలయాల్లో భక్తులు హరనామస్మరణతో మార్మోగాయి. స్థానిక మల్లేశ్వరస్వామి ఆలయంలో వేకువజాము నుంచి భక్తులు క్యూ కట్టారు. స్థానిక సర్పంచ్ కాళ్ళ సంజీవరావు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మంచినీటి సదుపాయం కల్పించారు. అలాగే ఆలయం చుట్టు పరిశుద్యపు పనులు నిర్వహించారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకుడు పాత్రుని లోకేష్ భక్తులకు ఉచితంగా ప్రసాధం పంపిణీ చేశారు. కొత్తపేట శివకేశవ పంచాయతన ఆలయంలోను భక్తులు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. కురుడు, సుబ్బరావు పేట, లఖందిడ్డి, గంగరాం, ఊడికలపాడు, యలమంచిలి, జర్జంగి, చవితిపేట ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిట్టేవలస శివాలయంలో ఆలయ ధర్మకర్త అన్నెపు రాధాక్రిష్ణ ఆద్వర్యంలో భక్తులు పెద్ద ఎత్తున అరటి గెలలు కట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పలాస/వజ్రపుకొత్తూరు: శివరాత్రి మహోత్సవాల సందర్భంగా శనివారం పలు శివాలయాల్లో భక్తుల శివ నామస్మరణతో మారు మ్రోగాయి. వజ్రపు కొత్తూరు మండలం శివసాగర్ బీచ్‌లోని శ్రీ నీలకంఠేశ్వర ఆలయం, వజ్రపుకొత్తూరు విశ్వేశ్వర ఆలయం, బెండి నందికేశ్వర ఆలయంతో పాటు తోటూరు, వంకులూరు, రాజాం, గరుడబద్ర, ధర్మ పురం, గుల్లలపాడు, పాతటెక్కలి, అమల పాడు, కంబాలరాయుడుపేట తదితర గ్రామాల్లోని ఆలయాల్లోనూ, కాశీబుగ్గ డెంకివీధి కాశీవిశ్వేశ్వర ఆలయం, మహాదేవపురం స్వయం భూలింగేశ్వర ఆలయం, పలాస మండలం బొడ్డపాడు ఆలయంలో భక్తులతో కిటకిటలాడాయి. మహా శివరాత్రి శనివారం కావడంతో భక్తులు రెట్టింపుగా పలాస నియోజకవర్గంలోని పలు శివాలయాల్లో అభిషేకం చేసేందుకు భక్తులు అర్ధరాత్రి నుంచే భక్తులు ఆలయాల వద్ద బారులు తీరారు. శివున్ని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాల వద్ద భక్తుల సౌకర్యం కోసం బారికేడ్లు, మంచినీరు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 2 గంటల వరకు భక్తులతో ఆలయాలు రద్దీగా ఉన్నాయి.

కాశీబుగ్గ : శివరాత్రి సందర్భంగా పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శనివారం శివరాత్రితో పాటు శనిత్రయోదశి పడడంతో కాశీబుగ్గలో ప్రముఖ శనీశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. ఒకానొక దశలో తోపులాట జరగడంతో పలువురు భక్తులకు గాయాలయ్యాయి. ఈ సమాచారం తెలుసుకున్న కాశీబుగ్గ పోలీసులు వచ్చిన భక్తుల తోపులను నియంత్రించారు.

కవిటి : మండలంలోని శైవ క్షేత్రాలు మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని భక్తులతో కిటకిటలాడాయి. దీంతో శనివారం వేకువజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు శైవక్షేత్రాలకు పోటెత్తారు. దీంతో శైవక్షేత్రాలు శివనామస్మరణతో మారుమోగాయి. అనేక రూపాల్లో దర్శనమిచ్చే స్వామిని శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. మండలంలోని జగతి, బల్లి పుట్టుగ, కవిటి, బోరివంక, చిన్న కర్రీవానిపాలెం, రాజపురం తదితర గ్రామాలలో శైవక్షేత్రాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

డి.గొనపపుట్టుగలో... మండలంలోని డి గొనప పుట్టుగ గ్రామంలో కొలువైన శ్రీ శ్రీ శ్రీ గోకర్ణేశ్వర స్వామివారి ఆలయ ప్రాంగణంలో అంగరంగ వైభవముగా మహా శివరాత్రి సందర్భంగా శివపార్వతులకు శివ స్వాములు,భక్తులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమములు నిర్వహించారు. ఈ సందర్భంగా గొనప రమేష్, కరగాన లక్ష్మీనారాయణ,గొనప శివకుమార్ ఆర్థిక సహాయంతో ఉదయము నుండి భజన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శివ స్వాముల ఆధ్వర్యంలో గంగ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ గోకర్ణేశ్వర భజన బృందము,గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

సోంపేట : ఈ మండలంలో ప్రసిద్ధ పురాతన ఆలయాలకు నిలయమైన మేజర్ పంచాయతీ బారువ గ్రామంలో శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. విశిష్ట శ్రీకోటిలింగేశ్వరాలయం, శ్రీబ్రహ్మజనార్ధన ఆలయంలో వైభవంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో వైకాపా నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొని భక్తులను మరింత ఉత్సాహ పరిచారు. స్థానిక సర్పంచ్ ఎర్ర రజని కుమారి ఆధ్వర్యంలో రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పోరేషన్ చైర్మన్ నర్తు రామారావు, స్థానిక ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు, జెడ్పీటిసి తడక యశోద, మండల వైకాపా కన్వీనర్ తడక జోగారావు, కంచిలి జెడ్పీటిసి ప్రతినిధి ఇప్పిలి కృష్ణారావు, మేజర్‌పంచాయతీ ఈఓ తెంబ వాసుదేవరావు, వైస్ ఎంపీపీ గుర్రాల శ్రీను, మాజీ ఎంపీపీ నర్తు చామంతి బారువ వైకాపా నేతలు సమూహంగా ఆలయాలకు వెళ్లి శివరాత్రి పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయాల అర్చకులు దేవాలయాల స్థితిగతులను నేతల దృష్టికి తీసుకు వచ్చారు.



మందస : ఆంధ్రా ఒడిసా సరిహద్దు ప్రాంతం తూర్పు కనుమల్లో ఎత్తైన శిఖరం మహేంద్ర గిరుల్లో ఉన్న పంచ పాండవుల ఆలయాలు, మహాశివ రాత్రి సందర్భంగా శనివారం లక్షలాది మంది భక్తులతో కిటకిటలాడాయి. ఆంధ్రా ఒరిసా రాష్ట్రాలకు చెందిన భక్తులు పాండవ ఆలయాలను సందర్శించారు. నిశ్శబ్ధంగా ఉన్న ఆటవీ ప్రాంతం భక్తజన సందోహంతో ఓం కార నాదంతో హోరెత్తి పోయింది. భక్తుల కోసం ఒరిస్సా ప్రభుత్వం ప్రత్యేక పోలీసు బందోబస్తుతో పాటు ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. భక్తుల రాకపోకలకు జిల్లా నలుమూలల నుంచి ఆర్టీసి సంస్థ ప్రత్యేక బస్సులను మందస మండలం సాబకోట నుంచి వివిధ ప్రాంతాలకు నడిపింది. పంచ పాండవుల ఆలయాలను సందర్శించిన భక్తులు తిరుగు ముఖంలో పొత్తంగిలో ఉన్న పొత్తేశ్వరాలయం, మందసలో ఉన్న వాసుదేవు, షిరిడిసాయి ఆలయాలను సందర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కాగా మండలంలో శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. వెకువజాము నుంచి శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

మెళియాపుట్టి : శివరాత్రి పర్వదినము సందర్భంగా దేవాలయాలను అలంకరణ చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన మహాశివరాత్రి పర్వదినంతో శనివారం మండలంలోని శైవక్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ముఖ్యంగామెళియాపుట్టి, చాపర, పట్టుపురం, జోడూరు తదితర గ్రామాల్లో గల ఆలయాలకు ప్రజలు పెద్ద ఎత్తున ఉదయం నుంచే శివాలయాలకు తండోపతండాలుగా చేరుకొని పరమేశ్వరున్ని దర్శించుకున్నారు. పలు ఆలయాల్లో అన్నదాన సంతర్పణ కార్యక్రమాలను సైతం ఏర్పాటు చేశారు. అనంతరం భక్తులు భక్తితో రాత్రంతా జాగరంతో శివాలయాలన్నీ భజన కార్యక్రమాలతో పాటు శివనామస్మరణతో కిక్కిరిశాయి. జొడూరు గ్రామంలో యువకులు పల్లికిలో ఉత్సవమూర్తులను గ్రామమంతా ఊరేగించారు. అదేవిధంగా మెళియాపుట్టి,చాపర గ్రామ శివాలయాల్లో లింగాభరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

సంతబొమ్మాళి : మహాశివరాత్రి సందర్భంగా మండలంలో గల శివాలయాల్లో, శివనామస్మరణతో మారు మ్రోగాయి. మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బోరుభద్ర, కొల్లిపాడు, సంతబొమ్మాళి, మేఘవరం, మూలపేట, నౌపడ రంకుహనుమంతపురం, దండుగోపాలపురంతో పాటు పలు గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో భక్తులు సందడి నెలకొంది. శనివారం ఉదయం నుంచే భక్తులు శివాలయాలకు వెళ్లి అభిషేకాలు నిర్వహించి, తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా శివాలయాల్లో భజన కార్యక్రమంలో నిర్వహించారు. అలాగే అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఎచ్చెర్ల : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పలు గ్రామాల్లోని శివాలయాలన్నీ వేకువ జామునుంచే భక్తులు శివుని దర్శించేందుకు బార్లు తీరారు. ఎచ్చెర్ల,చిలకపాలెం అల్లినగరం, అక్కివలస తమ్మి నాయుడుపేట, ఎస్ ఎం పురం, ముద్దాడ, ధర్మవరం, కుప్పిలి తదితర గ్రామాలలోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు.

ఇచ్ఛాపురం : పుష్కర పుష్కరానికి వచ్చే పర్వదినంగా భావించి శనివారం శివరాత్రిని భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. తొలి ఝామునే మేలుకొలుపుతో ప్రారంభించి శివార్చనలో మునిగి తేలారు. పట్టణంలో శ్రీ చిదంబరేశ్వర, శ్రీ పాతాళసిద్ధేశ్వర హరగౌరీ శైవపీఠం, శ్రీ ఉమా రామలింగేశ్వర, శ్రీ నర్మదేశ్వర, శ్రీ కాశీ విశ్వేశ్వర, ఖండేశ్వర, తారకేశ్వర, చంద్రశేఖర, ఉమామహేశ్వర, నీలకంఠేశ్వర, రత్నేశ్వర ఆలయాలతో పాటు మండలంలో వివిధ శైవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు బారులు తీరి దర్శనాలు చేసుకున్నారు. శివరాత్రి సందర్భంగా శ్రీ ఉమారామలింగేశ్వరాలయంలో సహస్ర లింగార్చన, అభిషేకాలు పురుషు గురుస్వామి పర్యవేక్షణలో ఫణిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపకాంతులతో ఆలయాలను అలంకరించారు.

టెక్కలి : రాష్ట్రంలో అతి పెద్ద స్వయంభుగ శివలింగం అయన శ్రీ శ్రీ ఎండల మల్లికార్జున స్వామి దేవస్థానం శివనామస్మరణతో మారు మోగింది. టెక్కలి మండలం, రావివలస గ్రామంలో కొలువైన ఎండల మల్లన్న పుణ్యక్షేత్రం మహాశివ రాత్రి పర్వదినం కావడంతో శనివారం వేకువ జాము నుండి భక్తులు ఎండల మల్లన్నను దర్శించుకొనుటకు తండోపతండాలగా తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి మల్లన్నను దర్శించుటకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్టు ఆలయ ఈవో వివి సూర్యనారాయణ తెలిపారు.